# ఈ పక్క పారే ఏరు ఆ పక్క ఎండే పైరు!

అప్పుడప్పుడూ గుడ్డిసోపరంగా[1] అయినట్టుగానే ఈ ఏడు గూడా సినపుషాల[2] పోకతలికే నేల మెత్తంగ పదునయింది. రోయ్నిబోయి ముగసిరవొచ్చి సల్లబడ్తానే సెనిక్కాయ సేలకు ఎరువూ మట్టీ దోలి గుల్లబడగ[3] సేద్యం సేసి పెట్టుకొన్నారు ఎండ తగ్గి సల్లబడడంతో, రొండు పూట్లా సేద్యాలూ ఎరువులూ తోలుకొని వారం రోజుల్లోనే ఊరంతా పని వొంగదీసిరి[4]. సెనిక్కాయి సేల సేద్యం ముందుగానే అయిపోయినోళ్ళు జొన్న సేలగ్గూడా ఒకటికి రెండు సార్లు పాపనం[5] అదీ జేసుకోని సేలను అద్దాల మాదిరి, అప్పుడే మంగలోడు గడ్డం గొరిగినాక కనపడే మొకాల మాదిరి మెరిపిచ్చిరి.

"పదునాయె, పరుగులాడి పరుగులాడి పనులన్నీ లడీ జేసికొంటిమి, ఇంగ ఇత్తనం వానపడేదుంది యమగండం" అనుకొంటావుండగా, ఎవురో, 'కుర్సిరాపో పాపం' అని పంపినట్టుగా ఆదలాబాదలా వచ్చి ఆ వాన గూడా పడెనబ్బా. ఆ రోజు వానొస్తాదని ఊళ్ళో ఒక పిట్ట గూడా అనుకోలా. అట్టాంటిది సగిరపొద్దు[6] దాటినాంక మొదలుపెట్టి సరీగ్గా అంబళ్ళ పొద్దుదాంకా తిప్పిచ్చి మల్లిచ్చి[7] కొట్టె !

ఆ వానట్ట ఎలిసిందో[8] లేదో మల్ల అంతలోకే, కమాన్ల మిద్దె గంగిరెడ్డి, తూరుపింటి సుబ్బయ్య, ఇంగా మూన్నాలు గిండ్లోళ్ళు వసార్లల్లో సెనిక్కాయలు పోసి మాదిగోళ్ళ పిల్లోళ్ళను తోలుకొచ్చి కూకోబెట్టి పప్పులు ఒలిపిచ్చబట్టిరి. వాళ్ళన్జూసి ఊరంతా ఇంగ తొక్కులాట.[9] ఇత్తనాల కాయలు దాపెట్టుకున్నోళ్ళు ఇట్టా తొక్కులాడుతాంటే లేనోళ్ళు మాత్రం తనకలాడిరి. ఈకసాల[10] సూసి యిదే వాటమనుకొని మాడిమిద్దె ఎంగట్రెడ్డీ, ఈదిలోళ్ళ నారాయణ అల్లుడూ పొద్దుటూరుకీ ఇంగా ఆడికీ యీడికీ బోయి లారీల్తో కాయలు తీసుకొచ్చి అలివిగాని దర పెట్టి అమ్మబట్టిరి. అప్పయితే నూటికి అయిదూపదీవొడ్డీ, కల్లంలోకి కాయిలొచ్చినాంక వాళ్లకే అమ్మేతట్టు కరారు.... ఇట్టా కడ్డీసన్లు[11].

కాయిల్లేనోళ్ళు సేసేదేముంది మల్ల ? ఆల్చెంజేస్తే ఆ పదును గూడా ఆరిపోతే అవతల నెత్తిన సేతులేసుకోని ఏడుస్తా కూకోవాల. యాటా పడే బాదే ఇది. ఇదొకటేగాదు. పడాల్చిన బాదల్లో ఏ బాదా తప్పదు. తప్పితే, నేనేనా అంత పనికిమాలినదాన్ని అని కోపగిచ్చుకొంటాయేమోననిపిస్తాది. ఈ యిత్తనాల కాయలుండాయే, ఇయి కొనేతప్పుడు నిప్పులయితే, పండినాక అమ్మేతప్పుడు బొగ్గులు, ఆ దరలూ, ఆ కతలూ కట్టాలూ సెప్పాలంటే ఇప్పుడుగాదు, నేను సచ్చేంతవరకూ సెప్పినా అయింగా బతికే వుంటాయి.

అందువల్ల ఇప్పటి కతే సెప్తాను. ఇత్తనాల కాయిలు రుదా[12] సేసు కుంటావుండాం అని తెల్చినా ఇత్తన మేయాల ఒక్కోసారి. అదున్లో ఇత్తనం బూమిలో బూడ్సితే మల్లెట్టన్నా అయితాది, అవతల నాలుగు సినుకులు రాలకపోతాయా అనుకోనీ, ఇప్పుడెయ్యకపోతే మల్లా వానొచ్చేతలికి అదును

---

1) అదృష్టవశాత్తు 2) పునర్వసు 3) మెత్తగా 4) పూర్తి జేసిరి 5) సేద్యంలో ఒక పద్ధతి 6) అర్ధరాత్రి 7) కుండపోతగా 8) ఆగిందో 9) తొందరపడిరి 10) గిరాకీ 11) కండీషన్స్ (షరతులు) 12) వృథా

దాటిపోతాదనీ, అరగొర పదునైనా ఇత్తనమేయాల. సినుకులు పన్నాయా మొలకలు వస్తాయి, పడక పాయెనా ఇత్తనాలు పాయె. లేదూ, ఆ అరగొర పదునుకే మొల్చినయి మొల్చినట్టు ! అదీ కత.

సరి.... ఎట్టనో కట్ట సావుజంపుల్తో [13] కాయలున్నోళ్ళు, లేనోళ్ళు అందరూ ఇత్తనాలు ఏసుకొన్రి. ఈసారి నేల్లో బాగా పదునుంది గదా, అందువల్ల రెక్కలిచ్చుకొంటా లేసిన కోడిపెట్టల మాదిరి సెనిక్కాయి సెట్లు పచ్చంగా యిచ్చుకొంటావచ్చె. ఏ సేను సూసినా కండ్లకు సల్లదనం ఇస్తా కత్తిరమెట్లు[14] పడేప్పటికే గుంటికె కనపడకుండా కప్పుకొనిపాయె. ఆ సేలను కండ్లారా సూసుకొనే రైతుల సంగతి ఏం చెప్తావులే!

ఊళ్ళో అందరికీ ఏందో సక్కిలిగిలి బెట్టినట్టుగా, సంబరమే సంబరం, నగులే నగులు ! యాడ సూసినా, ఎవురికెవురు ఎదురుపన్నా, అతగాని సేను అట్టుందంటే, ఇతగాని సేను ఇట్టుందని సెప్పుకోడాలు! సేలల్లో సెయ్యాల్సిన పనేమీ ల్యాకపోయినా, ఊరికెనే అట్ట ఏదో పనున్నట్టు పోయి వచ్చేవాళ్ళు. మొగోళ్ళే కాదు, ఆడోళ్లు కూడా ఏ గడ్డికో పోయి సూసొచ్చి సెప్పుకోవాల్చిందే !

అట్టా వున్నెప్పుడు అట్టాత్తుగా ఆయంపాట్న దెబ్బ తాకితే, అంతవరకూ నగుతా నగుతా వుండిన మొకంలో నొప్పి కనపడినట్టు అయిపాయె. రోజురోజుకూ తీగెలు సాగుతా పెరుగుతా వచ్చిన సెనిక్కాయ పైరు, ఆగిపోయి ఆ మొయిన వాడిపోబట్టె, పైరు ఎట్ట వాడిపోబట్టెనో అట్టనే వాళ్ళ మొకాలు గూడా వాడిపోబట్టె. అందుకే, సేలల్లో పైరెట్టుందో తెల్చుకోవాలంటే ఊళ్ళో మనుసుల మొకాలు సూడాలనేది.

వాడిపోయే పైరును సూల్లేక సేలకు పోవడమే మానుకొన్రి. ఇరాట పరవం సదివిచ్చిరి, పోతురాజుకూ, కప్పాలమ్మకూ నీళ్ళు పోసిరి, సీతారాముల పెండ్లి జేసిరి. ఎన్ని జేసినా సినుకు నేల్న రాలకఫాయె. వస్తాదని యెవురూ అనుకోనప్పుడు వచ్చిన వాన , వస్తాద వస్తాదని ఎగజూసినప్పుడు ఎగ్గొట్టె. ఎగ్గొట్టింది ఎగ్గొట్టినట్టుండక, ఏరు పారిచ్చి ఏడిపిచ్చె ! ఆ రోజు తెల్లవారుజాము సీకటి ఇంగా ఇచ్చిపోకముందే.... ఏటిమీద ఎల్లర పర్సినట్టు [15] ఎక్కడ జూసినా పరవళ్ళు తొక్కే నీళ్ళు !

అంటే ఎగువ నెక్కన్నో బెమ్మాండమైన వాన కుర్సిందన్నమాట. ఇంతకు ముందు ఇట్టా ఏరు పారినప్పుడంతా సూడ్డానికి రొండు కండ్లూ సాలనట్టు సంతోషంగా సూస్తావుండేవాళ్ళు. ఏరు పారడమూ సూసిందే. పైరు ఎండడమూ సూసిందే. రెండిట్నీ ఒక్కపారి సూడ్డమే సెప్పలేని బాద! ఇప్పుడు ఒక కంటిలో పారే ఏరు కనిపిస్తాంటే, ఇంగోకంటిలో ఎండే పైరు కనిపిస్తా వుంటాది.

రొండు కండ్లూ దగ్గరే, అయినా అయి రొండూ కల్చేందుకు ఇంత ఎడమా ?

---

13) కష్టాలతో 14) గడ్డిని చంపే సేద్యం 15) వెలుతురు